# శృంగార బంగార శ్రీనాథం

ఆయన మహాకవి. త్రిమూర్తుల్లో బ్రహ్మ, శివుడికంటే విష్ణువు ప్రపంచవృద్ధికి ఎలా కర్తయ్యాడో-అలాగే తెలుగు సాహిత్యానికి ఆయన శ్రీ మహ విష్ణువు అతడే శ్రీనాథుడు.

తెలుగు సాహిత్యాన్ని తేజోమంతం చేసే కావ్యాలు శృంగార నైషధం, కాశీఖండం, హరవిలాసం, భీమేశ్వర పురాణం, శివరాత్రి మాహాత్మ్యం (క్రీడాభి రామం) రాసినా తెలుగువారికి బాగా తేట తెల్లగా ఉండి చల్లగా పాడుకునేందుకు-తెలుగువారికి తెలుగు చందస్సు ద్విపదలో రాసిన మహాకావ్యం పల్నాటి వీర చరిత్ర.

శ్రీనాదుడు కొండవీటరెడ్ల ఆస్థానం చేరినతరువాత (చేరకముందు కూడా దేశద్రిమ్మరే) వివిధ ప్రదేశాలు చూశాడు. వివిధ రాజస్థానాలు చూశాడు అక్కడి కవులతో వాగ్యుద్ధాలు, సంవాదాలు, చర్చలు చేశాడు. ఊరూరు తిరుగుతూ వర్ణనలతో స్త్రీలను రూపు కట్టించాడు. ఆయన సాహిత్యం ఎంత విలువైందో-ఆయన చెప్పిన చాటువులు అంత విలువైనవి. కావ్యాలు దేశచరిత్రను కొంతే చెబుతాయి. కాని చాటువులు చెప్పే చరిత్రని సాంఘిక వ్యవస్థని అవి కళ్ళకు కట్టినట్టుగా నాటి దేశకాలమాన పరిస్థితుల్ని చెబుతాయి. శిలాశాసనాల కన్న స్పష్టంగా రాజశాసనాలకన్నా సూటిగా చెపుతాయి

ఆయన అలా తిరుగాడే రోజుల్లో పలనాడు వెళ్ళాడు అప్పుడు ఎన్నో అనుభవాలు ఎన్నో ఆనందాలు అన్నిటికీ అన్ని పద్యాలు-మంచినీళ్ళు దొరకపోతే సిరిగలవారికి చెల్లును తరుణుల పదియారువేల తగ పెండ్లాడన్ తిరిపెమున కిద్ద రాండ్రా! .... పరమేశా గంగ విడవు పార్వతి చాలున్.

శివుడి నెత్తిమీద గంగమ్మ దిగొస్తేతప్ప నీరుపుట్టని దేశం అది. రాజుల, రారాజుల, మహారాజుల, మహామంత్రుల సరసన మహారాజభోగం అనుభవించాడు. విస్సనమంత్రి స్వర్గస్తుడయ్యాడని హేమపాత్రాన్నము ఎవని పంక్తిలో కలదని

బాధపడిన భోగి అప్సరోభామిని వక్షోజద్వయ కుంభికుంభాలపై కస్తూరి వాసనలు చిమ్మడానికి కస్తూరి బిక్షవేడిన మహాభోగి, అలాంటివాడు - భోజన సమయంలో జొన్నకలి, జొన్నము, జొన్న అంబలి, జొన్న పిసరు, జొన్నలేతప్పు సన్నన్నం మాటేలేకపోతే ఎలా తినగలడు.

ఇక ఆడువాళ్ళ ఊరు వ్యాఘ్రనగరం (పులిపాడు) ఉరగంబు (నాగయో! శేషయ్యో)! కరణం, కాపు కపివరుడు (హనుమయ్యో, అంజనేయులో) కసవు (పుల్లిగాడు నేడు...అలాంటిచోట ఇలాంటి కవికి ఏం మర్యాదలు జరిగి ఉంటాయి. అందుకే నోరు తీరా తిట్టేశాడు.

అలా తిరుగుతూఉంటే కారెంపూడి వచ్చాడు.

అక్కడ—

వీరులు దివ్యలింగములు విష్ణువు చెన్నుడు కల్లిపోతరా
జారయ భైరవుండు తుహినాద్రి జయాంకము నిర్మలాంబులై
కేరెడు గంధగార మడుగే మణి కర్ణిక యన్ని రీతులన్
కారెమపూడి పట్టణము కాశిగదా పలనాటి వారికిన్

అంతగా ప్రస్తుతించాడు కాబట్టే మనకు పలనాటి చరిత్ర పాడి పోయాడు.

భారతానికి ఎంత ప్రశస్తి, ప్రకాస్తి ఉందో పలనాటి భారతానికి అంతే ప్రశస్తి, ప్రకాస్తి ఉంది. భారతంలో అభిమన్యుడికి ఎంత ప్రాముఖ్యత ఉందో. పల్నాటి చరిత్రలో బాలచంద్రుడికి అంతే ప్రాముఖ్యత ఉంది. అది చదువుతూ ఎంత పొంగిపోతారో ఇది వింటూ అంతే పొంగిపోతారు జనం! భారతంలో .అశ్వద్థామ అగ్రతః చతురోవేదాః పృష్ఠతః సశరం ధనుః

ఇదంబ్రాహ్మ్య మిదం క్షాత్రం శాపాదపి శరాదపి అని ఉన్నట్టుగా ఇందులో ఈ పల్నాటి వీర భారతంలో అనపోతుఉన్నాడు. అది ఎలా ప్రత్యక్షర రసార్ణవమో ఇదీ అలా ప్రతి పద రసోదయం.

అన్ని కావ్యాలు రాసి, అన్ని చాటువులు చెప్పి అఖిలాంధ్రావళి మోదం పడసిన కవి సార్వభౌముడికి - ఈ చిన్నద్విపద రచన ఎందుకు చేయాలన్పించింది. చేసింది చాలకా? తృప్తి లేకా? విషయపరిపూర్ణత విశిష్టత కారణమా? రణమా?

మాచర్ల చెన్న కేశవుడు కలలో కన్పించి శౌర్యంబు పుణ్యంబు సమకూర్చి 'ట్టి పలనాటి వీరుల భాగవతం' అంకితం ఇమ్మన్నాడు. దానికి కవిగారు పలనాటి వీరుల చరిత జనులెల్ల భక్తిచే చదువుట కొరకు మంజరిద్విపదగా .... వచః శ్రీ మెరయగ చెప్పబూనాడు,

దేవుడు పలనాటి వీరుల భాగవతం అన్నా అందరూ దీన్ని భారతం తోటీ పోల్చారు మరి !

ఇంతకూ భారత యుద్ధానికి ఏదోరీతిగా ద్రౌపది కారణం అయినట్లుగా ఈ పల్నాటి యుద్ధానికి కారణం నాగమ్మనే నాయకురాలు - అటు బ్రహ్మనాయుడు ఇటు నాగమ్మగా రాజ్యతంత్రం రణతంత్రంసాగింది. భారత యుద్ధానికి జూదం ఎలా ప్రాతిపదకో ఈ యుద్ధానికి కోడి పందాలు అలా మూల హేతువు. గురజాల వాళ్లు మాచర్ల వెళ్లి రాజ్యం నిర్మించుకున్నా-రాకపోకలు సాగుతూ సంబరాలలో అంబరాన్నంటే పొరపొచ్చాలు వచ్చి పాండవులు అడవికి వెళ్లినట్టే మాచర్ల వదిలి వలస పోయి. తర్వాత అక్కడ లాగా ఇక్కడ యుద్ధం. భారతానికి శ్రీకృష్ణుడిలాగా ఈ పల్నాటి కథకు బ్రహ్మనాయుడు. శకునిలా తంత్రం నడిపింది నాయకురాలు. కథ కంటే కథనంలో కదను తొక్కుతుంది శ్రీనాధుని కలం.

అక్కడ యుద్ధం జరుగుతుంటే ఇక్కడ బాలచంద్రుడు బొంగారాలు ఆడుతుంటాడు. ఆటలో బొంగరం వెళ్లి అన్నమ్మ అనే వైశ్య కాంతకు తగిలి ఆమె మూర్ఛపోతుంది. తర్వాత తేరుకొని బాలచంద్రుడికి చీవాట్లు పెడుతుంది ఓరి దురాత్ముడా ! ఓరి దుర్మార్గ ! క్రింద మీ దెరుగ కెరలు చున్నావు. గర్వమేటికి నీవు....కలిగిన తినవలె కట్టంగవలయు....ముదిరె మదంబు నీమురిపెంబు క్రుంగ....త్రుళ్ళుచునున్నావు దుష్ట చిత్తుండ....చూచెదు కనులకు సూదులగుచ్చ. మీ అయ్య లెల్లను మించిన బలిమిచేరి వైరులతోడ శ్రీయుద్ధభూమి ఉప్పొంగుచున్నవారు రిపునెదుట వారిలో కలియు నీవడి కానవచ్చు పోతు సింహమురీతి పొదలుచున్నావు అని ఆమె చెరిగిపోస్తే-నయవిదుడైన బాలచంద్రుడు నొప్పి కల్గుటచే నోరాపలేని అనరానిమాటల ఆడితిగాని బొంగరం బదితాకెనిన్ను నా తప్పుమన్నింపు "నయభావమున" అని క్షమాపణ అడుగుతాడు.

అక్కడినుంచి తల్లి ఐతమ్మ వద్దకు వెళ్ళి ఎక్కడ యుద్ధం ఏమిటికథ అని అడుగగా ఆమె మూర్ఛబోతుంది. యుద్ధాన్ని భయంకరంగా వర్ణిస్తుంది. "ఘనకరీంద్రముల ఘీంకారరావంబు సాంద్రతురంగ హేషా విజృంభణము రధనేమి సంకుల ప్రబల శబ్దంబులమిత పదాతి చయ అట్టహాసంబు భేరిదమాముల ఢీక్కను మ్రోత" ఎలా సహిస్తావు నీవేదరణమేడ నీ బలమేడ? బాలురతో నాడు పగిది కాదోయి చెక్కులు మీటిన ఒందును పాలునుదురు మీటిన నూనెవెళ్ళెదును గండ్ర తనంబుల గైకోకు తనయ అని మందలిస్తుంది,

అయితే కుర్రాడు "నలగాము డెరుగును నాదు శౌర్యంబు-ఎదురెవ్వరే నాకు" అంటాడు పేరు పేరున ప్రళయరుదుని, అర్జుని, భీముని, హనుమను, రాముని పోల్చుకుంటాడు దానికామె ఆ అబ్బురాల కొడుకోసం అమ్మా అబ్బా ఎంత తపించారో చెబుతుంది. అయినా బాలుడు వినడు. ఆమె అతడ్ని అతని భార్య మాంచాల సెలవు తీసుకోమని చెప్పి పంపుతుంది. మగువ మాంచాల మరో మచ్చు తునక. ఆమె భర్తని దీవించి ఖడ్గం ఇచ్చి పంపుతుంది.

అసలీ బాలచంద్రుడు....గత జన్మల్లో లోహితుడు, ప్రహ్లాదుడు' సిరియాళుడు, అంగదుడు, కుశుడు, అభిమన్యుడు…నట ఇదంతా బాలల కథ, బాల మనోహరమైన గాథ.

ఘనుడైన శ్రీనాథ కవిరాజ రాజు
చెన్నుని కృపచేత చిత్తముప్పొంగి
బాలు విక్రమ ప్రావీణ్యమెల్ల
జనులకి వివరించె....

ఆసక్తితో దీనిని పాటించి చదివిన, వ్రాసిన వినిన బంధువులు పుత్రులు పౌత్రులు హెచ్చ సకల శుభములు సమకూరు. ఇక చదవండి.